

# తడిసి మోపెడు

భ.రా.గో

నా పంధొమ్మిదో యేట చేరాను, పొలాలూ, స్థలాలూ కొలిచే సర్వే ఉద్యోగంలో. అప్పట్లోనూ, ఆ తరవాత చాలాకాలంవరకూనూ మన రాష్ట్రంలో చాలినన్ని రోడ్లు ఉండకా, రోడ్డున్నా బస్సు సౌకర్యాలు లేకా, నా ఉద్యోగధర్మం చాలాకాలంపాటు నడిచే నిర్వహించాను.

నడిచీ, నడిచీ, కొలిచీ, కొలిచీ రాష్ట్రంలోని ఇరవైమూడు జిల్లాల్లో పదకొండు జిల్లాలు తిరిగాను. సాగినన్నాళ్ళూ సాగిన నా నడకకి సుమారు ఎనిమిదేళ్ళకిందట మోపెడ్లు ముమ్మరంగా మార్కెట్లోకి దిగినప్పుడు బ్రేకుపడ్డ నడక అక్కడ ఆగిపోయిందనుకోకండి. నా నడకకిపడ్డ బ్రేకు వేగాన్నీ, ధ్వనినీ పెంచడానికీ నా స్థానిక ప్రయాణాల పరిమాణాన్ని గుణీకృతం చెయ్యడానికీ పద్దాదిగానీ ఆపెయ్యమనికాదు. ఎందుకంటే ఆ ఎనిమిదేళ్ళనాడు నేనొక మోపెడ్ కొన్నాను.

దరిద్రుడు తల కడిగితే వడగళ్ళవాన అన్నారు. అలాగ్గా నేను మోపెడ్‌కొన్న మర్నాడు డ్యూటీకొస్తుండగా ఏ హెచ్చరికా లేకండా వాన పట్టుకుంది. ఇంతా అంతాకాదు. అరగంట వ్యవధిలో అరవై మిల్లీమీటర్లు కురిసి ఠకీమని ఆగిపోయింది. కాపురం మల్కాపురంలోనూ, డ్యూటీ టౌన్లోనూ కావడంవల్ల ఈ అరగంట ప్రయాణంలోనూ నేనూ నా మోపెడూ చిత్తుగా తడిసి ఓ కిలోమీటర్ దూరం బండితోసుకోవలిసొచ్చింది. నేననుకున్నట్టే నన్ను పలకరించిన వాళ్ళందరూ మోపెడ్ కొన్నారా, ఎంతైంది అని అడగడం, అందరికీ ఒకటే సమాధానం చెప్పడం సంభవించింది. అదే - తడిపి మోపెడు.

అందరూ ఆ సమాధానాన్ని అలా మింగేసి వూరుకున్నారు. మా డాక్టర్ ఫ్రెండుమాత్రం "పోన్లే! ఇన్నాళ్ళకి నువ్వు కూడా ఓ బండివాడివయ్యేవన్న మాట" అన్నాడు. అతను అంతకు ఐదా



ళ్ళ కిందటే ఇంటివాడూ, బండివాడూ అయ్యేడు. అంచేత మరి నేనేం మాటాడ లేదు.

అప్పుడెప్పుడో ఒకాయన మేకపిల్లని కొనుక్కెడుతూవుంటే ఇది మేకపిల్లకాదు కుక్కపిల్ల అని పద్ధతిగా చెప్పి కుట్రచేసి ముగ్గురు పెద్దమనుషులు ఆ మేకపిల్లని అపహరించేరుట. అలాగ అపహరించే వుద్దేశంతో కాకపోయినా నా మోపెడ్‌నీ, దాన్ని కొన్నందుకు నన్ను అపహాస్యం



చేస్తూ జనం దైలా గు లెయ్యడం అదో ప్రహసనాల మాలిక. ఆ వివరాలు కొద్దిగా మనవి చేస్తాను.

పాపారావుగారని, విశాఖపట్నం రచయితలకి ఓ అన్‌లిస్టెడ్ క్రిటిక్కు. రాజకీయశాస్త్రంనుంచి రతిశాస్త్రం వరకు అన్నీ చదివి విమర్శించడమే అతని కాలక్షేపం. ఓ అరగంట అతని మాటల్ని ఫాలో అయినవాడు ఐదారు జీవిత సత్యాలను కొత్తగా గ్రహించక తప్పదు. అయనొక సారి నేను మోపెడ్‌మీద వెళ్తుండగా తటస్థపడ్డాడు. అప్పుడ్రి డౌన్‌లో సర్రుమని వొచ్చేస్తూవుంటే ఎంతదూరంనించీ చూసేడోగాని చెయ్యి అడ్డంపెట్టి ఆపేడు. "ఏటివాయ్, మంచి జోరుమీదుందే ఎవ హారం!" అన్నాడు. "ఔను! మోటారుండికదా ఇంకా జోరుగా వెళ్ళక పోవాలా?" అన్నాను. "నన్ను పోల్త్రీ దెగ్గిర దింపేస్తావేటి?" అన్నాడు. "ఓ" అన్నాను. వెనకాతల కూచోమని సూచన చేసి, అతను నావేపూ, నా బండివేపూ పరీక్షగా చూసి "లాబంలేదుగురూ! ఇది మన్ని కాయదు. దీనికి గుండె సిన్నది, సీటు సిన్నది. ఇలాటిది కొన్నావేటిగురూ! అగినన్నాళ్లాగినావుగండా కుంచెం పెద్దది కొన్లేకపోయేవా?" అనేశాడు.

మరోమాటు మా బావమరిది కూతురు వర్లక్ష్మి ఇంటరో యేగో చదువుతూవుండేది. అప్పట్లో — దొండపర్తి బస్‌స్టాపు దగ్గిర "మామయ్యోయ్" అని పెద్ద కేకేసి ఆపింది. "ఏంటి మామయ్యా! తొత్తిగా అటూ యిటూ చూడకుండా వెళ్ళిపోతున్నావు? ఎవరేనా లిఫ్ట్ ఇమ్మని అడుగుతారని భయమేనా అదంతా?" అంది. "అలాక్కాదే మేనకోడలా. ఈ వూళ్లో మోటర్లవాళ్ళు రోడ్డుమీదా, ట్రాఫిక్ సిగ్నల్స్‌మీదా తప్ప మరెక్కడా దృష్టి పెట్టుకోకూడదు. యాభై గజాలకో స్పీడు బ్రేకరు, పదేసి గజాలకో గొయ్యి నీ మనుషుల వేపు చూస్తూ పోతే గోతిలోపడ్డం ఖాయం. అందుకని!" అన్నాను. "ఐతే నీ మూషిక వాహనంమీద నన్నెక్కనియ్యవా?" అంది. "ఎక్కడ దించమంటావు?" అన్నాను. "జగదంబా సెంటర్లో దింపీ మామయ్యా అక్కణ్ణించి కాలేజీకి బస్సులో వెళ్ళిపోతాను" అంది.

ఒకటికి రెండు ప్రాణాలు కదా అనీ, అందులోనూ ఆడపిల్ల కదా అనీ జాగ్రత్తగా వెళ్తున్నాను. ఆ పిల్లకి ఆ స్పీడు నచ్చకపోతే గేరుమార్చు, స్పీడుపెంచు అని పాటవరసలో కాకపోయినా మాటవరసకైనా ఆ మాట చెప్పొచ్చుగా. డాబా గార్డెన్ స్టాప్‌కి, జగదంబా జంక్షన్‌కి మధ్య తనెక్కవలసిన బస్సు మమ్మల్ని దాటుకుని వెళ్ళిపోయిందట. నేను స్లోగా వెళ్ళే బండి కొన్నానని విసుక్కుంటూ విశ్వనాధం విగ్రహం దగ్గిర బండి ఆపించి దిగెళ్ళిపోయింది.

ఆవేళనించి నాకు కసి పెరిగిందనుకుంటాను. రోజూ మల్కాపురంనించి ఆఫీసుకి వచ్చేటప్పుడు రంప్యామని నలభై కిలోమీటర్ల స్పీడులో వచ్చేస్తూ నా బండికేం అని ధీమాపడ్డం మొదలెట్టేను. ఓరోజు అలా వస్తూ, డ్రైడాక్‌కి కొంచెం దక్షిణంగా ఒకచోట మూడున్నర హార్స్ పవర్ బండినొకదాన్ని దాటేశాను కూడాను. ఆ బండిమీద తెల్లటి యూనిఫారం వేసుకున్న ఆఫీసర్ ఒకాయన వస్తున్నాడు. ఆ బండిక్కూడా తెల్లరంగే వేశారు. వెనకాల ఒక అడకూతురు మహా తెల్లటిపిల్ల కూచునుంది. ఉంటే నాకేం? నేను నా బండితో ఆ బండిని దాటేశానన్నది తేటతెల్లమైపోయింది.

అయితే అతనలా ఊరుకోలేదు. ఓ నిమిషం గడిచేలోగా డుబ్ డుబ్ లాడుకుంటూ నా కుడిపక్కగా వొచ్చేసి "మిస్టర్! ఓ క్షణం ఆగుతావా, నీతో మాట్లాడాలి!" అన్నాడు ఇంగ్లీషులో. నాకు కొద్దిగా భయం వేసింది. అతని బండిమీద "నేవల్ పోలీసు" అని రాసి వుంది. ఎక్కువ స్పీడులో వస్తున్నానని నామీద ఏదైనా కేసుపెట్టమని సివిల్ పోలీసుకు సలహాగానీ ఇచ్చేస్తాడేమో!నా నాయనా అనుకున్నాను. కాని అంతలోనే ధైర్యం తెచ్చుకున్నాను. నాబండి ఏక్సిలరేటరు సరుకేగాని గేరు బండి కాదు. ఎంత పీక్కున్నా నలభై కిలోమీటర్ల స్పీడుకన్నా వెళ్ళదు. అదోపెద్ద స్పీడు కాదు. అంచేత "ఓ షూర్" అని నా బండిని పక్కగా తీసి ఆపాను. ఎందుకేనా మంచిదని కిందికిదిగి, నిలబడి స్టాండ్ కూడా వేసేను. అతను నా బండిని దాటుకెళ్ళి అక్కడ తన బండి ఆపి ముందు ఆ అమ్మాయిని దిగమని, తరవాత తను దిగి, స్టాండేసి నా దగ్గిరికొచ్చేడు.


"ఎన్నాళ్ళయింది ఈ బండికొని?"

"రెండునెల్లవుతోంది"

బండి హాండిలూ బ్రేకులూ అవీ పట్టుకుని చూశాడు. ఓసారి స్టార్ట్‌చేసేడు. కళ్ళెగరేసి "బానే పోతున్నట్టుందే!" అన్నాడు.

"ఫరవాలేదు" అన్నాను జాగర్త



భయం నాస్తి ధోరణిలో.

"అదే నేనూ అనుకుంటున్నాను" అని ఆ అమ్మాయిని రమ్మని సంజ్ఞచేసేడు ఆవిడ రాగానే "చూశావా, నే చెప్పలే!" అన్నాడు. నావేపు తిరిగి, "మా ఆవిడకి ఇలాటిదొకటి కొందామని ఉద్దేశం. మీ సలహా ఏమిటి?" అన్నాడు.

దాంతో నాకు భయం పోయిందిగాని ఏదో వికారం పుట్టింది. "ఓ తప్పుకుండాను! ఇక నేను వెళ్ళొచ్చా?" అని బండి స్టార్ట్ చేశాను.

* * *


జీవితాన్ని గురించి సూక్ష్మంలో మోక్షంగా వ్యాఖ్యానం చెయ్యమని ఓ తత్వవేత్తని అడిగితే ఆయన చెప్పేడుట. జీవితం అనేది, మాటవరసకి, నువ్వూ నీ మిత్రుడూ కాఫీహోటలుకి వెళ్ళి చెరొక రవ్వదోశా ఆర్డరివ్వడం లాంటిదని చెప్పొచ్చు. సర్వర్‌కి, మీకిద్దరికీ విబేధాలు కల్పించాలన్న తలంపు లేదు. దోసె వేసేవాడు మిమ్మల్నసలు చూడలేదు. కాని చివరికి ఏమైంది? నీ మిత్రుడికెదురుగా వుంచిన ప్లేట్లో దోశ కొంచెం పెద్దది, మరొక్కచాయ ఎర్రగా కాలింది, అనిపిస్తుంది. అంతే —


తనకి లేదని ఏడిస్తే వొకన్ను పోతుందనీ. ఇంకోడికి ఉందని ఏడిస్తే రెండో కన్ను పోతుందనీ మరోతత్వవేత్త శెలవిచ్చారట. అయినా ప్రపంచంఅంతా రెలెటివిటీ మీదనే నడుస్తోందని నా అనుమానం. నా ఉద్యోగంకన్నా (నా అర్హతలేఉన్న) సూర్యారావుకొచ్చిన ఉద్యోగం మంచిదేమో. మాకిచ్చిన క్వార్టర్స్‌కన్నా (నా వేజ్ గ్రూప్‌లోనే ఉన్న) కృష్ణారావుకిచ్చిన క్వార్టర్స్ ఆరోగ్యమేమో. ఇంకా కొంచెం లోతుకి వెడితే మా ఆవిడకన్నా ఆ మనోహర్రావుగాడి పెళ్ళాం అందమైందేమో. మా పిల్లలకన్నా గోవిందరావుగారి పిల్లలు స్మార్ట్‌గా ఉంటారేమో!

నాకు తెలుసు. మీలో చాలామంది ఇలా ఆలోచించరు. ఎవరికెలా రాసిపెట్టుంటే అలాగ అని సంతృప్తిపడి జీవితాన్నిగొప్ప కంటెంట్‌మెంట్‌తో అనుభవిస్తున్నారని నాకు తెలుసు. కాని నాదౌర్భాగ్యమేమిటో. సంతృప్తి అన్నది లేకుండా పోయింది! రోడ్డుమీద నా మోపెడు తోలుకుంటూ వెళ్తూనా, మిగిలిన మోటారు వాహనాలు దేన్ని చూసినా నాకుచిరాకే, అసూయే. నాది సగం హార్స్‌పవర్ బండికదా. ఆఫీసులో నా రూమ్‌లో నాతోకలిసి పనిచేసే ఖిగతా నలుగురికీ ఒకటిన్నర హార్స్‌పవర్ బండ్లున్నాయి. పక్క రూమ్‌లో నాకన్నా చిన్న వుద్యోగస్తులు ముగ్గురికి ఒకటింముప్పాతిక, రెండున్నర, మూడున్నర హార్స్‌పవర్లు గల బండ్లున్నాయి. వాళ్ళందర్నీ చూసి అసూయతో, చిరాకుతో కుళ్ళిపోయి చస్తూవుంటాన్నేను. మా ఆఫీసులో మిగిలినవాళ్ళలో చాలా మంది వున్నవి మోపెడ్లే, అయినా అవన్నీ ఇంకేవో కంపెనీలవి. తడిసీ మోపెడ్లుకావు తడవని మోపెడ్లేమోనని నా బండికన్నా ఏదైనా నయమేమోననీ అనిపిస్తుంది అస్తమానన్ను.

ఈ ఏడెనిమిదేళ్ళలోనూ నా మోపెడ్‌ని చిన్నచూపు చూసిన సంఘటనలైతేనేమి, దాన్ని కొన్నందుకూ - అనేక మందిలాగా ఏడాదో రెండేళ్లో గడవగానే అమ్మిపారేసి మరో పెద్దబండి కొనకుండా దాన్నే మెయింటేన్ చేస్తూ ఏకపత్నీవ్రతుడిగా కొనసాగుతున్నందుకూ - నన్నో అప్రయోజకుడిగా చూసిన సంఘటనలైతేనేమి, చాలా జరిగేయి, మాట వరసకి కొన్ని ఉదహరిస్తాను, రెల్లివీధి దగ్గిర ఓసారి కాలేజీడౌన్ మీదుగా కలెక్టరాఫీసుకి వెళ్తుండగా తోవలో ఏమైందమకున్నారు? ఓ ఇద్దరు, రోడ్డుమధ్యని నిర్భయంగా నిలబడి ఏదోమాటామాటా అనుకుంటున్నారు. నేను హారన్ మోగించాను. వాళ్ళు కదల్లేదు, వాళ్ళగొడవే వాళ్ళది! వీళ్ళపని ఇలాక్కాదని బండి ఆపేను, అంటే, ఇంజన్ ఆపకుండా బ్రేకుమాత్రం వేసేనన్నమాట. మళ్ళీ హారన్ మోగించేను. అబ్బే, వాళ్ళు అంగుళంకూడా జరగలేదు. ట్రాఫిక్‌రూల్సన్నీ తప్పనిసరిగా అమలు పరుస్తానని ఆర్.టి.ఓ. ఆఫీసులో రాతమూలకంగా హామీ ఇచ్చి రోడ్డుటాక్సు కూడా కట్టిన నాకు; ఏహామీలూ ఇవ్వకుండా రోడ్డుటాక్సు కూడా కట్టకండా వున్న వాళ్ళు దారివ్వకుండా నిలబడ్డమా అని నాకు ఉక్కురోషమొచ్చింది. జేబులో చెయ్యిపెట్టి రెండు పది పైసల నాణాలుతీసి ఇద్దరికీ చెరోటీ ఇచ్చాను. వాళ్ళు కొంచెం ఆశ్చర్యపడినా అసంకల్పితంగా పుచ్చేసుకున్నారు. నేను బండిలాగించేసి జోరుగా వెళిపోతూ "గుడ్డోడికి చెవిటోడికీదర్మం" అని కేకేశాను.

మరోమాటేమైందనుకున్నారు? డైమండ్ పార్క్‌కి దగ్గిరగా (రోడ్డు మధ్యనే, మళ్ళా!) ఓ నలుగురు నిలబడి ఎన్నికల్లో యెవరు గెలుస్తారు, ఎందుకు? అనే విషయంమీద కాబోలు, తీవ్రమైన





చర్చలో ఉన్నారు. వాళ్ళకూ్కడా తప్పుకోమని సూచిస్తూ హారన్ కొట్టాను. వాళ్ళేం తప్పుకోలేదుగానీ అందులో ఒకాయన "ఎందుకు ?" అన్నట్టు చూశాడు. చుట్టూ చూశాను ఎంతెంతలేసి పెద్దపెద్ద వాహనాలవాళ్ళూ మనకెందుకులే అన్నట్టుగా వాళ్ళే తప్పుకుని పోతున్నారు. "ఇక్కడ పార్కు ఎక్కడండి ?" అన్నాను. నన్నో వెర్రివెధవకింద చూసి "ఇదేగా" అని పక్కనేఉన్న పార్కువేపు చూపించాడు అతను. నేను బండి బ్రేకులు వదిలి ఏక్సిలరేటరు బిగించి "మరి మీ మీటింగు రోడ్డు మీద పెట్టేరేమిటి ?" అంటూ లాగించేశాను.

ఉంకోమాటు - ఇసకతోట దగ్గర! ఇసకతోటంటే తెలుసుగా, మంచి రద్దీ అయిన ప్రదేశం. జనం బోలెడు ఇళ్ళు కట్టుకున్నారు. అయినా ఎవ్వరూ ఇళ్ళల్లో వుండరు. అంతా రోడ్లమీదనే ఉంటారు. ఏడాది పొడుగుతా కనీసం పదిమంది పిక్నిక్ సీజన్‌లో ఇరవై మంది లారీలకింద పడి చచ్చిపోతూ ఉంటారు. ఏక్సిడెంట్ జరిగిన గంటలో అంతా మర్చిపోయి మళ్ళా రోడ్డు మీదకి చేరుకుంటారు. అలాటిచోట నేను మోపెడ్ మీద వెళ్తుంటే ఒక అజానుబాహుడు తీరిగ్గా రోడ్డు ఇట్నుంచటు దాటుతున్నాడు. నా బండి నేను నడుపుతున్న ప్రకారం వెళితే అతన్ని గుద్దేయడం ఖాయం. అయినాసరే! పెళ్ళైపోయినపిల్ల మేనత్త కొడుకునిచూసి బెదరనట్టు ధీమాగా వెళ్ళేడతను. నేను రోడ్డుకి పక్కగా నా బండి ఆపి (ఇంజిన్ ఆపలేదు, బ్రేకేసేనంతే) అతన్ని పిల్చాను, "అప్పారావూ, ఇట్రాఓసారి" అని -

అతను వచ్చేడు. "నాపేరు అప్పారావు కాదు"

"సింహాచలమా ?" అన్నాను.

"కాదే!"

"పోనీ పైడితల్లి" అన్నాను.

"అదీకాదు, ఇంతకీ ఏటి ?" అన్నాడతను.

నేను కళ్ళెగరేసి "మంచి పెర్సనాల్టీగున్నావోయ్" అన్నాను.

అతను కాలర్ పైకెత్తుకుని మీసం సవరించుకుని "అయ్ !" అన్నాడు ఖుషీగా.

"కానీ ! ఇదుగో ఈ రోడ్డుమీద నువ్విప్పుడు నడిచినట్టు నడిస్తే ఏ లారీయో గుద్దేసి కాలో చెయ్యో ఇరిగిపోద్ది. నువ్వు ఆస్పటలుకి ఆడు జేలుకి ఎళ్ళిపోతారు తెల్సా ?" అని బోధించి యథాప్రకారం బండి లాగించేశాను.


ఇలాగ ట్రాఫిక్‌రూల్సు గురించీ రోడ్డు మధ్యని పాదచారులు నిలబడుట లేక నడుచుటయందలి ప్రమాదములు అనే విషయం గురించీ ఇంకా ఈవూళ్లో ఏడులక్షల తొంభైతొమ్మిదివేల తొమ్మిదివందల మందికి పైగా చెప్పాలి. ఎందుకంటే ఈ ఊరి జనాభా ఎనిమిది లక్షలుట. అయినా నేను నిరుత్సాహ పడదల్చుకోలేదు.

* * *

మొన్నోరోజు ఆఫీసునుంచి కొంచెం త్వరగా ఇంటికొచ్చేసేను. మళ్లా బయటికి వెళ్ళవలసిన పనున్నాదికదా అని మోపెడ్ ఇంట్లోకి తెచ్చికుండా రోడ్డువారని ఉంచీసేను. కిటికీ పక్కని కూచుని కాఫీ తాగుతూ ఓ కన్ను అటుంచేను. ఇంతలో ఎవరో ఓ మనిషి నా మోపెడ్‌ని అదే పనిగా గమనిస్తూ అందుకోసం దాని చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్టు తెలిసిపోయింది. ఏదైనా కుక్క అలా తిరిగిందంటే దానిఅర్థంవేరు. కనక వెంటనే లేచివెళ్ళి తరిమేసేషని, అయితే మనిషేకదా అని నిర్లక్ష్యం చేసినందుకు అతనేంచేశాడనుకున్నారూ ?

అబ్బే ! అతను నామోపెడ్ దొంగతనం చెయ్యలేదు. దానికెంత గుండె కావాలి ! అసలు ఎవరైనా ఆ మోపెడ్‌ని ఉన్నదున్నట్టుగా స్టార్ట్ చెయ్యగలిగితే సన్మానం చేసో చప్పట్లు కొట్టో దాన్ని అతని పేర రిజిస్టర్ చేయించేసే యెచ్చని నా సహోధ్యాయులు కొందరు అంటారు.


అయితే అతనేంచేసేడు ? మా పక్కవాటా వాళ్ళ తలుపుకొట్టి ఈమోపెడ్ ఎవరిదండీ అని అడిగేడు. వాళ్ళు నా పేరు చెప్పి, మా వాటా చూపించేరు (అంతా కిటికీలోంచి కనబడుతూనేఉంది.)



అతను మా తలుపుతోసుకుని లోపలికొచ్చేసి నమస్కారం చెప్పికుర్చీ ఈడ్చుకుని కూచున్నాడు. నేను ఫలానా కంపెనీ మోపెడ్ల సేల్స్‌ప్రొమోటర్నని చెప్పేడు. నాకు అర్థమైపోయింది. నామోపెడ్ ఆ కంపెనీదేగా. ఫ్రీసర్వీసింగు, చెడిపోయిన పార్టులకి బదులు కొత్తవి చవగ్గా సరఫరాచెయ్యడం అలాంటి కార్యక్రమాలేవో ఉన్నాయిగావును, అనుకున్నాను.

అతను చెప్పింది వింటే నాకేకాదు, మీక్కూడా కోపం వస్తుంది.

నామోపెడ్ ఎనిమిదేళ్ళనాటి మోడల్లోదిట. దరిమిలాను ఆ కంపెనీవారు ఇంకా కొంత కృషిచేసి ఈమోపెడ్ నాణ్యతను పెంచుకుంటూపోయి కొత్తరకాలు విడుదల చేస్తున్న కారణంగా నా 1979 మోడల్ మోపెడ్ ఇంకా రోడ్డుమీగ తిరగడం కంపెనీకి అంతమంచిది కాదుట. అందుకని దీన్ని ఏదోధర చేసి కంపెనీకే




ఇచ్చెయ్యాలన్నాడు.

నేను కొంచం బాధపడ్డా చివరికి పోనీ సరేలే అన్నాను. ఎంతధర చెప్పొచ్చు – అని కాయితం కలం తీసి లెక్కేశాను. మొదట కొన్నది మూడువేల ఎనిమిది వందలకి. ఏడాదిలో రెండు టైర్లూ ట్యూబులూ పోయాయి. అప్పట్లో మూడు వందలు. రెండో యేడు నడుస్తుండగా ఓమారూ, నాలుగేళ్ళ తరవాత ఓమారూ నాలుగేళ్ళ తరవాత ఓమారూ ఇంజిన్ రీబోర్ చేయించేను. ఆరువందలు. ఆరో యేడు నడుస్తూ వుండగా కొత్త ఇంజిన్ వేయించేను. ఆరువందలు. మధ్యలో మరో రెండుసార్లు టైర్లు, ట్యూబులు మార్చాను. ఆరు వందలు. మొన్న డిశంబర్‌లో కార్బురేటరు కొత్తది వేశాను. మూడువందలు. ఇంకా సైలెన్సర్ డీకార్బనైజ్ చెయ్యడం, బ్రేకు షూలు మార్చడం బెల్టులు మార్చడంలాంటి చిల్లరమల్లర రిపేర్లు ఐదువందలు పెట్టాను. అంతా కలిసి ఆరువేల నాలుగువందలైంది. మరీ ఈ ఎనిమిదేళ్ళు పెట్రోలు పోయించేను కదా. దానికో నాలుగువేలేనా అయ్యుండదూ? అంచేత పదివేలిచ్చి పట్టుకుపోతే అదే పదివేలన్నాను. మీరు నవ్వుతున్నారు కదూ. అతనూ నవ్వేడు. అదంతా ఎందుకుగానీ, ఇచ్చేధర చెప్పేమన్నాడు.

"ఇచ్చేధర కాకపోతే మరేమిటి! ఇప్పుడు మీరిది పట్టుకుపోతే నేను కొత్త బండి కొనుక్కోవాలి కదా. ఈమాటు మోపెడ్ కాకండా కనీసం రెండుగేరైనా ఉండేదిగా చూసి కొనుక్కుంటాను" అన్నాను.

"అలాఅయినా ఎనిమిదివేలకి మించి లేదు. కాని ఇప్పుడేదో కొత్త రూల్ వచ్చిందికదా. పన్నెండేళ్ళకి ఒకేసారి రోడ్డు టాక్స్ కట్టాలని. దానిమాటేమిటి మరి?" అన్నాను.

అతను కోపంగా మొహం పెట్టి "అసలు మా కంపెనీ మోపెడ్‌ని మీరు సరిగా మెయిన్‌టేన్ చెయ్యకుండా డొక్కులాగా తయారుచేసి, ఏకీలుకాకీలు విరక్కొట్టి రోడ్డుమీద ధమ ధమ ధమ ధమ అని చప్పుడుచేసి అందరిదృష్టి ఆకర్షిస్తూ మా కంపెనీకి అప్రదిష్ట తెస్తున్నారు. అందుకని మీ మీద పరువునష్టం దావా వేస్తాం" అని లేచి వెళ్ళిపోయాడు. •••



kriveni
INKS & ADHESIVES
• ఫౌంటన్ పెన్ను ఇంకు
• స్టాంపు పాడ్ ఇంకు
• పాకెజ్ మార్కింగ్ ఇంకు
• నంబరింగ్ ఇంకు
• గమ్
• ఆఫీసు పేస్ట్
65 సంవత్సరములకు పైగా వాడుకదారుల ఏకైక ఎన్నికగా మన్నన పొందినవి.

ముస్తాబులో మార్పు!

సరిక్రొత్త ఆకర్షణీయమైన సీసాలలో
లోధ్ర
బాధారహిత ప్రకృతి సిద్ధమయిన ఆరోగ్యమును స్త్రీలకు 80 సంవత్సరములుగా ఇచ్చుచున్నది.
ఉచిత వైద్య సలహాకు ఈ కూపనును మీ వ్యాధి వివరములతో పంపండి.
పేరు: ..................
విలాసము: ..................
..................
ఏజంట్లు:
సీతారామ్ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్.
విజయవాడ - సికిందరాబాద్
కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14